సాక్షి
జనగామ

శనివారం | 14 | సెప్టెంబర్ | 2024

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి పోటీలకు కూనూర్ విద్యార్థులు..



జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పూజశ్రీ, రిషిత, అక్షయ, అభినయరెడ్డి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు అకుల సాయికుమార్ తెలిపారు. ఇటీవల హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరు ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం ఎండీ పర్వేజ్‌తో పాటు ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఇదిలా ఉండగా.. జఫర్‌గఢ్ వెలుగు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు మేఘన, కళ్యాణి, సనా పరుగుపందెం, సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వరలక్ష్మి తెలిపారు.

ప్రపంచ మేధావి ఏచూరి



జనగామ రూరల్: ప్రపంచ మేధావి సీతారాం ఏచూరి.. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అహల్య మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి అంచెలంచలుగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగి రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సీతారాం.. ప్రజాసమస్యలపై గళమెత్తి వాటి పరిష్కారానికి దిశానిర్దేశం చూపిన గొప్ప మేధావి అని అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన 2,4,10 వార్డుల్లో నివాళులర్పించారు. కళ్యాణి, వరలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి





డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ఎస్ఎస్ఎఫ్‌పీ నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్ని గుర్తించి ప్రతీ 15 రోజులకు ఒకసారి బరువు, ఎత్తు కొలతలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో చిన్నారుల స్థితిని తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉన్న పిల్లల్ని ఎన్ఆర్‌సీకి రెఫర్ చేయడంతోపాటు వారు సాధారణ స్థితికి వచ్చేంత వరకు పర్యవేక్షిస్తూ బాలామృతం ప్లస్ న్యూట్రిషన్ అందించాలని తెలిపారు. ఆర్బీఎస్కే బృందాలు ప్రతీ నెల పిల్లల బరువు పరిశీలించాలని, పౌష్టికాహార లోపం ఉన్న వారికి సరైన పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రతీ సెక్టార్ సమావేశంలో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల వివరాల నివేదిక ఇవ్వాలన్నారు. సీడీపీఓలు రమాదేవి, ఫ్లోరెన్స్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, జూడాలు, ట్రైనర్ జిల్లా కోఆర్డినేటర్ మహేష్, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, సోమయ్య, శ్రీకాంత్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దయాగ్నోస్టిక్ సెంటర్ తనిఖీ

జనగామ: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ నిర్వహణ, రక్త పరీక్షల తీరు తదితరాలను పరిశీలించారు. జిల్లా పరిధి నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి రోజువారీగా 700 వరకు రక్త నమూనాలు సేకరించి డయా గ్నోస్టిక్ సెంటర్‌కు పంపిస్తారని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు వివరించగా.. ఫలితాలు నూరుశాతం వచ్చేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ల్యాబ్‌లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ రవీందర్‌గౌడ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

జీపీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన


జనగామ: జిల్లా వ్యాప్తంగా జీపీల పరిధిలో శుక్రవారం వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. డీపీఓ స్వరూప నేతృత్వంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యాన గ్రామ పంచాయతీ, మండలపరిషత్, మున్సిపల్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో జాబితాను ప్రదర్శనకు పెట్టారు. పాలకుర్తి మండలంలో కొత్తగా ఏర్పడిన దుబ్బతండా, మేకతండా జీపీలు కలుపుకుని 283 గ్రామ పంచాయతీల పరిధిలో 4,09,558 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,02,981, మహిళలు 2,06,573 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. ఈనెల 18న జిల్లా, 19న మండల స్థాయి ముసాయిదా జాబితాపై పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహిస్తారు. 21 వరకు అభ్యంతరాల స్వీకరణ, 26న డీపీఓ ఆధ్వర్యాన అభ్యంతరాల తొలగింపు, 28న ఫొటోతో కూడిన తుది జాబితా ప్రచురిస్తారు.

ఓటరు జాబితాలను పరిశీలించాలి

పాలకుర్తి: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శనకు ఉంచామని, ఓటర్లు పరిశీలించాలని డీపీఓ స్వరూప అన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఆమె ఓటరు జాబితాను ప్రదర్శించారు. అనంతరం గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం కోసం పలు చెరువులు, కుంటలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ రాములు, పాలకుర్తి జీపీ కార్యదర్శి వెంకటేశ్వరాచారి తదితరులు ఉన్నారు.



డీపీఓ స్వరూప సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న జీపీ సిబ్బంది



రూ.103 కోట్లకుపైనే..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వినాయక నవరాత్రుల ఖర్చు

వినాయక నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే అందరిలో ఉత్సాహం ఉరకలేస్తుంది. అట్టహాసంగా ప్రతిష్ఠాపన చేసి తొమ్మిది రోజులపాటు స్వామివారికి పూజలు చేయడం, అన్నప్రసాదాల వితరణ చేసి భక్తిపారవశ్యంలో మునిగితేలుతారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మొదలై శనివారానికి ఎనిమిది రోజులైంది. ఏ గల్లీలో చూసినా గణేశ్ మహరాజ్‌కి జై.. నినాదాలు మార్మోగుతున్నాయి. పార్వతి తనయుడిని ఊరూవాడా తేడా లేకుండా కీర్తిస్తున్నారు. నవ రాత్రులు ముగిసేందుకు మరొక రోజు మిగిలి ఉంది. సోమవారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనానికి తరలించనున్నారు. ఈమేరకు గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- వరంగల్ డెస్క్

- విగ్రహంతోపాటు సెట్టింగ్, లైటింగ్, అన్నదానాలకు అధికంగా వెచ్చింపు
- విగ్రహం నుంచి అన్నదానం వరకు దాతల సహకారమే..
- ఉమ్మడి జిల్లాలో 8,066 విగ్రహాలు.. జియో ట్యాగింగ్ చేసిన పోలీసులు
- లెక్కలోకి రానివి మరో వెయ్యి ప్రతిమలు ఉంటాయని అంచనా
- గతేడాదికంటే గ్రామాలు, తండాల్లో ఐదుశాతం పెరిగిన విగ్రహాలు
- స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో విరివిగా ఇప్పించిన ఆశావహులు



జనగామ పట్టణంలో పూజలందుకుంటున్న వినాయకుడు

- పూర్తి వివరాలు 8లో

చీడపీడల నివారణే కీలకం

- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- వరి నారు కొన తుంచి నాటు వేయాలి
- 15 రోజుల తర్వాత వేరుశనగ విత్తుకోవాలి
- కూరగాయల సాగుకు అనువైన సమయం
- రబీ సీజన్ నుంచి పంటల బీమా



'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఏఓ రామారావు నాయక్

జనగామ: వర్షాలు, వరదల నేపథ్యంలో పంటలకు తెగుళ్ల ఆశించి దిగుబడి తగ్గే ప్రమాదం పొంచింది.. చీడపీడల నివారణే కీలకం.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ అన్నారు. ఇటీవల కురిసిన వరుస వర్షాల నేపథ్యంలో సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ శాఖ నుంచి సలహాలు, సూచనలు అందించేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 65 మందికిపైగా రైతులు సందేహాలు వ్యక్తం చేయగా డీఏఓ వాటిని నివృత్తి చేశారు. పంటలను ఆశించిన తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రైతు: వరి పొట్ట దశలో ఎర్రబారి చచ్చిపోతున్నది.
– అరుకల శ్రీనివాస్, సదాశివునిపేట, బచ్చన్నపేట

డీఏఓ: పొట్ట దశలో గింజ బయటకు రాకముందే కాపర్ హైడ్రాక్సైడ్ కొట్టుకోవచ్చు. ఇప్పుడు పురుగు వచ్చి వెళ్లి పోయింది. పంటను ముట్టుకోవద్దు.

రైతు: పత్తి పంటకు ముడత, ఎరుపు వచ్చింది.
– నీల రాకేష్, శివునిపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్

డీఏఓ: నివారణకు కార్బన్డైజిమ్ గ్రాము, సీఓసీ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ముడతకు ఏఓ సూచన పాటించాలి.

రైతు: వరి పంటలో 30శాతం ఊస తిరిగింది.
– కాడబోయిన సోమయ్య, నీర్మాల, దేవరుప్పుల

డీఏఓ: దీనిని కాండం తొలుచు పురుగు అంటారు. మొదటి నుంచి జాగ్రత్త పడితే మంచిది. అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారిని సంప్రదించి సూచనలు పాటించాలి.

రైతు: సన్నరకం వరి కొనలు మాడిపోతున్నాయి.
– అశోక్, కొడవటూరు, బచ్చన్నపేట

డీఏఓ: కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, స్టెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి దుబ్బ దశలోనే పిచికారీ చేస్తే మంచిది.

రైతు: 1010 రకం వరిలో గొట్టం రోగం వచ్చింది.
– వెంకట్‌రెడ్డి, క్లశం, లింగాలఘణపురం

డీఏఓ: క్లోరీఫైరిపాస్ పిచికారీ చేయాలి. ఈ దశలో పెద్దగా చేసేది ఏమీ లేదు.

రైతు: ఇసుక మేటలతో వరి కప్పుకుపోయింది. కింది మడులు ఎర్రబారాయి.
– పేరబోయిన కుమార్, నెల్లుట్ల, లింగాలఘణపురం

డీఏఓ: దీనిని ఎండాకు తెగులు అంటారు. కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, స్టెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాములు పొట్ట దశలోపే పిచికారీ చేయాలి. అలాగే 15 నుంచి 20 కిలోల వరకు పొటాష్ వేయాలి.

రైతు: వరి పంటకు మచ్చలు వచ్చాయి.
– జంగిలి తిరుపతి, కొడవటూరు, బచ్చన్నపేట

డీఏఓ: నివారణకు కాపర్‌క్లోరైడ్ లేదా స్టెప్టోమైసిన్ లీటరు నీటిలో కలిపి పూత దశలో కొట్టాలి. కాండం తొలుచు పురుగును మొదటి దశలోనే నాశనం చేయాలి. తెల్లూసకు ఇప్పుడు ఏమీ చేయలేం.

రైతు: వరి పొట్ట దశలో ఎరుపు రంగు వచ్చింది.
– ఇంద్రసేనారెడ్డి, తానేదార్‌పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్

డీఏఓ: పసుపు పచ్చగా ఉంటే ఈ పురుగును ఇప్పటి నుంచే నియంత్రించాలి. కాపర్‌హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, స్టెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పూత దశకు ముందే పిచికారీ చేయాలి.

రైతు: వానాకాలం, యాసంగి సీజన్లలో ఏ పంటలు వేసుకోవాలి. అవగాహన కల్పించాలి.
– ఎద్ల శ్రీనివాస్, మరిగడి, జనగామ

డీఏఓ: ప్రతీ మంగళవారం అన్ని రైతు వేదికల్లో సైంటిస్టులు, ఉత్తమ రైతులతో లైవ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాం. నేరుగా రైతులతోనే మాట్లాడిస్తున్నాం. అయినా సదస్సులు నిర్వహిస్తాం. ప్రస్తుతం మట్టి పరీక్షల స్కీం లేదు. సాయిల్ టెస్ట్ అవసరమని రైతులు భావిస్తే శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తాం.

రైతు: వర్షాలకు పత్తి ఎర్రగా మారింది.
– కొడకండ్ల వీర్యానాయక్, కడగూడతండా

డీఏఓ: 999 లేదా 13045 మందును పైపాటుగా పిచికారీ చేయాలి. ఆకుమచ్చలకు కార్బండిజమ్ పైపాటుగా వారానికి రెండుసార్లు స్ప్రే చేయాలి.

రైతు: మిరప తోటలో ఎరుపు రంగు వస్తున్నది. వరిలో ఉల్లికోడు పెరిగింది. గొట్టం రోగం వచ్చింది. పత్తి చేను ఒరిగింది. కాయలు కుళ్లి పోతున్నాయి.
– కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, సింగరాజుపల్లి, దేవరుప్పుల

డీఏఓ: మిరప తోటలో నీరు నిలువకుండా చూసుకోవాలి. ట్రికోడెర్మా విరిడి మందు 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదళ్లలో వేయాలి. పడిపోయిన పత్తి పంటకు కార్బండిజమ్ 2 గ్రాములు, సాఫ్ లీటరు నీటిలో కలిపి వారానికి రెండుసార్లు పిచికారీ చేయాలి. ఈ సమయంలో వరికి ఉల్లికోడు రావద్దు. ఏఓ పరిశీలించి సూచనలు ఇస్తారు.

రైతు: రుణమాఫీ రావడం లేదు. రూ.5.30లక్షలకు గత మేలో రూ.3.33లక్షలు తిరిగి చెల్లించా. ఇప్పుడు రూ.1.98 లక్షల డ్యూ ఉంది.
– కొడగాని రాంచంద్రం, మాదాపురం, దేవరుప్పుల

డీఏఓ: బ్యాంకు నుంచి జాబితా అంతకు ముందే వెళ్లింది. అందులో రూ.2లక్షలకు పైగా రుణం చూపిస్తుంది. ప్రస్తుతం సర్వే జరుగుతున్నది. రేషన్‌కార్డు ఉంది కాబట్టి టెన్షన్ వద్దు. రుణమాఫీ అవుతుంది.

రైతు: పత్తి పూత రాలిపోతున్నది. దోమ ఉన్నది.
– ఈగ కృష్ణమూర్తి, కూనూరు, జఫర్‌గఢ్

డీఏఓ: ఇటీవలి వర్షాలతో చీడ పీడలు ఆశించి పంటకు బలం పోయింది. 999 లేదా 13045 మందును పైపాటిగా పిచికారీ చేయాలి. వీలు కాకుంటే పొటాష్ కలిపి యూరియాతో మొదళ్లలో వేయాలి. కాయకుళ్లు నివారణ చర్యలు చేపట్టాలి.

రైతు: పత్తికి జాజురోగం వచ్చింది.
– బాలాజీ, బీబీతండా, జఫర్‌గఢ్

డీఏఓ: ఈ రోగం మరింత ఎక్కువైతే ప్రమాదం. కార్బండిజమ్ 2.5, మాంకోజమ్ 2.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాష్, యూరియా కలిపి మొక్క మొదట్లో వేసి మట్టితో కప్పాలి.

రైతు: పత్తి కాయలు, గూడ రాలిపోతున్నది. ఆకులు పండుబారాయి.
– చిర్ర వీరస్వామి, కుందారం

డీఏఓ: 13045 లేదా 999 మందును 10 గ్రాములు నీటిలో కలిసి పిచికారీ చేయాలి. కాయకుళ్లు నివారణకు 3 గ్రాములు సీవోసీ, 0.1 పొంటామైసీ లీటరు నీటిలో కలిపి 15 రోజుల్లో మూడుసార్లు పిచికారీ చేయాలి. పొలంలో నీళ్లు ఎక్కువగా ఉంటే పాయలుగా తీసి బయటకు పంపించాలి.

రైతు: పంటల బీమా ఏమైయింది.
– మంతపురి యాదగిరి,కన్నయపల్లి, రఘునాథపల్లి

డీఏఓ: వచ్చే రబీ సీజన్ నుంచి పంటల బీమా అమలులోకి రానుంది. రైతులకు అవగాహన కల్పిస్తాం.

రైతు: పత్తి మొక్కలు పడిపోయాయి. పల్లికాయ వేసుకోవచ్చా.
– బోరెం నరేందర్, పెద్దమడూరు, దేవరుప్పుల

డీఏఓ: పైకి లేపే ప్రయత్నం చేస్తే వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉంది. ఉన్న పత్తిని కాపాడుకోవాల్సిందే. మరో 15 రోజులు ఆగి పల్లికాయ సాగు చేసుకోవచ్చు. సీడ్–6 తదితర రకాలకు మంచి డిమాండ్ ఉంది. కూరగాయల తోటలు సాగు చేస్తే త్వరగా దిగుబడి వస్తుంది. ఆర్థికంగా ఎదగవచ్చు.

అందుబాటులో 'ఆర్టీసీ క్యూఆర్ కోడ్'

- కూర్చున్న చోటు నుంచే సేవలు
- 'గమ్యం' యాప్‌లో పూర్తి సమాచారం
- డిపో మేనేజర్ ఎస్.స్వాతి వెల్లడి



జనగామ: ప్రైవేట్ పోటీని తట్టుకుని ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి 'ప్రగతి రథం–ప్రజా సేవా పథం' నినాదంతో ఆర్టీసీ ముందుకెళ్తోంది.. అందులో భాగంగా సేవలను క్షేత్రస్థాయికి విస్తరించడానికి 'క్యూఆర్ కోడ్'ను సంస్థ అందుబాటులోకి తెచ్చిందని జనగామ డిపో మేనేజర్ ఎస్.స్వాతి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ సీట్ల రిజర్వేషన్, డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 'క్యూఆర్ కోడ్'తో కూర్చున్న చోటు నుంచే సంస్థ సేవలను పొందవచ్చన్నారు. ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడి వరకు వచ్చింది.. దూర ప్రాంతాల నుంచి వచ్చే కుటుంబ సభ్యులు స్టేజీకి చేరుకునే సమయం, రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల పూర్తి సమాచారం, ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వు చేసుకునే అవకాశం 'గమ్యం' యాప్‌లో ఉంటుందని చెప్పారు. సలహాలు, సూచనలు, సమస్యలు, సేవలు, తదితర ఫిర్యాదులకు సంబంధించి ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ వేదికల ద్వారా తెలియ జేయాలని సూచించారు. వేడుకలు, శుభకార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ సర్వీసులను రాయితీపై తక్కువ ధరకే బుకింగ్ చేసుకోవచ్చన్నారు. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు సంబంధించి అండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు యాప్‌లు ఉంటాయన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సంస్థను ప్రోత్సహించాలని కోరారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి

జనగామ రూరల్: ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీపై అవగాహన అవసరమని జిల్లా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ వేముల సతీష్‌కుమార్ అన్నారు. ఈనెల 1 నుంచి 31 వరకు దేశవ్యాప్తంగా చేపట్టిన అవగాహన, టెస్టింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రిన్సిపాల్ పావని, మారి సంస్థ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీహెచ్, వైద్య కళాశాలలో ఉద్యోగాలు

- ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 50 పోస్టులకు షెడ్యూల్ విడుదల
- ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ



జనగామ: జనగామ మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 13 కేటగిరీల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ల్యాబ్ అటెండెంట్లు (15), డాటా ఎంట్రీ ఆపరేటర్లు(7), దోబీ/ప్యాకర్స్ (4), ప్లంబర్(1), థియేటర్ అసిస్టెంట్(2), గ్యాస్ ఆపరేటర్(2), వార్డ్ బాయ్(4) జనగామ జిల్లాకు.. రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్లు(3), సీటీ స్కాన్ టెక్నీషియన్లు(3), ఈసీజీ టెక్నీషియన్లు(2), అనస్థీషియా టెక్నీషియన్లు(4), ఎలక్ట్రీషియన్లు(2), హెవీ వెహికిల్ డ్రైవర్(1) పోస్టులు జనగామ, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలకు కేటాయించిన విధంగా నియామకం ఉంటుందని, 2025 మార్చి 31 వరకు పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అవసరాన్ని బట్టి తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. కలెక్టర్(జిల్లా కమిటీ చైర్మన్), ప్రిన్సిపాల్(కన్వీనర్), ముగ్గురు సభ్యుల పర్యవేక్షణలో రిక్రూట్‌మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో జనగామ చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ ఆస్పత్రి రెండో అంతస్తు ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. www.gmcjangaon.org/, www.jangaon.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి సమాచారం డౌన్‌లోడ్ చేసుకుని అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్, స్వీయ ధృవీకరణతో రావాలన్నారు. దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ.100, ఇతరులకు రూ.200, దివ్యాంగులు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈనెల 28 సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు పరిశీలించి తాత్కాలిక మెరిట్ జాబితాను ప్రిన్సిపాల్ మెడికల్ కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. 30న అభ్యంతరాల స్వీకరణ, వచ్చేనెల 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు తుది మెరిట్ జాబితా విడుదల చేస్తామన్నారు. 2వ తేదీన ఉద్యోగులకు ఆర్డర్ కాపీలు జారీ చేస్తామని వివరించారు.

నిమజ్జన ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల చెరువులో జనగామ పట్టణానికి సంబంధించిన గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం నెల్లుట్ల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల్లో వీధిలైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, క్రేన్‌లు, తెప్పలను వినియోగించాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. కలెక్టర్‌తో జనగామ ఏసీపీ పార్థసారధి, ఆర్డీఓ కొమురయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఏ తల్లి కన్నబిడ్డో..

● చెట్ల పొదల్లో పసికందు మృతదేహం


ప్లాస్టిక్ కవర్లో ఉన్న శిశువు మృతదేహం

లింగాలఘణపురం: జనగామ – సూర్యాపేట రోడ్డులో లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామంలోని చెరువు సమీపంలో శుక్రవారం అప్పుడే జన్మించిన ఓ మగ శిశువు మృతదేహం లభ్యమైంది. ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి చెత్త కుప్పలో పడేసిన ఈ మృతదేహాన్ని చూసినవారు.. ఏతల్లి కన్నబిడ్డవో.. ఇలా చెత్తకుప్పల పాలయ్యావా.. అంటూ ఆవేదనకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం చెరువులో చేపలు పట్టేందుకు వచ్చిన వారు చూసి ప్లాస్టిక్ కవర్‌లో ఏదో ఉందని గుర్తించారు. కవర్‌లో శిశువు మృతదేహం ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై శ్రవణ్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు. దీనికి గల కారణాలను పరిశీలించారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

● చిట్యాలలో విషాద ఘటన


మన్విత్ శకుంతల్ (ఫైల్)

పెద్దవంగర: ఆనందమంతా తనదే అన్నట్టు అప్పటి వరకు ఎంతో సంతోషంగా ఆడుకున్న ఆ చిన్నారిని నీటి సంపు కబలించింది. కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచేసింది. మూడేళ్లకే నూరేళ్లు నిండాయా బిడ్డా అంటూ ఆ కన్నతల్లి రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన తన్నీరు రమ–వేణు దంపతులకు సాయి శకుంతల్, మన్విత్ శకుంతల్ ఇద్దరు సంతానం.. కాగా వేణు తొర్రూరు పట్టణ కేంద్రంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. పెద్దబాబును పాఠశాలకు పంపించాడు. చిన్న బాబు మన్విత్‌శకుంతల్ (3)ను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించేందుకు స్నానం చేయించడానికి ప్రయత్నించగా అతను ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. దీంతో తల్లి ఇంటిపనుల్లో నిమగ్నమైంది. ఈక్రమంలో ఇంటికి తిరిగి వచ్చిన బాలుడు నీటి సంపులో పడిపోయాడు. కాసేపటికి కుమారుడి కోసం వెతికిన తల్లికి నీటిసంపులో తన బిడ్డ విగత జీవిగా కన్పించడంతో గుండెలుబాదుకుంటూ విలపించింది. బాలుడి తండ్రి వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన దంపతులపై కేసు

ఐనవోలు: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన దంపతులపై కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై, తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం సింగారం గ్రామానికి చెందిన చాగంటి రాములు, లక్ష్మీలకు ఇద్దరు కుమారులు. రాములు ఇద్దరు కుమారులకు గతంలో పెద్ద మనుషుల సమక్షంలో తన ఆస్తిని పంపకం చేసి కాగితాలు రాసుకున్నారు. తన పెద్ద కుమారుడు మృతిచెందగా ఆయన కుమారుడు అభిలాష్‌కు పెద్ద కోడలు అనితను గార్డియన్‌గా పెడుతూ గిఫ్ట్ రిజిస్ట్రేషన్ శుక్రవారం చేశాడు. ఈ క్రమంలో రాములు చిన్న కొడుకు చాగంటి శేఖర్, కోడలు మౌనికలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌పై తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగి, విధులకు ఆటంకం కలిగించారు. దీంతో తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మస్తు పిరం

భారీగా పెరిగిన కూరగాయల ధరలు



- రూ.200తో బేజార్ పుట్టిస్తున్న బిన్నీస్
- ఆకాశాన్నంటిన పాలకూర, కొత్తిమీర
- సామాన్యుడికి అందుబాటులో లేని వైనం
- వర్షాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలే కారణం

వరంగల్/భూపాలపల్లి: ప్రతిరోజు స్వచ్ఛమైన కూరగాయలతో వండిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారనేది వాస్తవం కానీ, ప్రస్తుతం ధరలు చూస్తూ ఆరోగ్యం మాటఅటుంచితే.. గుండె దఢ వచ్చే పరిస్థితి ఉంది. కొన్ని రోజులుగా పెరిగిన కూరగాయల ధరలతో ప్రజలు అయోమయానికి గురికాకతప్పడంలేదు. వర్షాకాలం ఆరంభం నుంచి కూరగాయల ధరలు దిగి రాకపోవడమే కాకుండా ప్రస్తుతం మరింత పిరం కావడంతో కొనలేని పరిస్థితులు నెల కొన్నాయి. రెండు నెలల క్రితం మిర్చి, టమాట ధరలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు అవి మినహా మిగిలిన ధరలు చుక్కలను చూపిస్తున్నాయి. స్థానికంగా గీసుకొండ, సంగెం, ఆత్మకూరు, హసన్‌పర్తి, వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలోని రైతులు కొంత మంది కూరగాయలు పండిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతినడంతో స్థానిక కూరగాయలు రావడం లేదని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ మేరకు సరుకులు రాకపోవడంతో మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, నెల్లూరు, కడపతోపాటు బెంగళూరు, చిక్కమగళూర్, తెలంగాణలోని ఒండి మామిడిపల్లి, సిద్దిపేట, హైదరాబాద్ గడ్డి అన్నారం మార్కెట్‌ల నుంచి కొన్ని రకాల కూరగాయలను తెప్పిస్తున్నారు. కాగా ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అక్కడ సరుకు లేకపోవడం వల్ల మధ్యప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడం వల్ల నెల క్రితం వరకు ఉన్న ధరలు ప్రస్తుతం డబుల్ అయ్యాయి. దీంతో వ్యాపారులు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

టమాట, మిర్చి ధరలు ఉపశమనం

జూన్ నెలాఖరు వరకు టమాట, మిర్చి ధరలు చుక్కలు చూపెట్టగా కొత్త పంట చేతికి రావడంతో వీటి ధరలు అమాంతం పడిపోయాయి. మార్కెట్‌లో శుక్రవారం రిటైల్‌గా టమాట కిలో రూ.30, మిర్చి కేవలం రూ.20 ధరలు పలికాయి. దీంతో వినియోగదారులు టమాట, మిర్చిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు తెలిపారు.

కొత్తమీర రూ.130-160 పైనే..



స్థానికంగా కొత్తమీర లభ్యం కాకపోవడంతో బెంగళూరు నుంచి తెప్పిస్తున్నారు. ప్రతి రోజు వరంగల్ మార్కెట్‌లో సుమారు 10టన్నులకు పైగా కొత్తిమీర అమ్మకాలు సాగుతున్నాయి. గత మూడేళ్లుగా వాతావరణ పరిస్థితుల వల్ల స్థానికంగా కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే పంట వస్తున్నట్లు తెలిసింది. మిగిలిన కాలం మొత్తం బయట నుంచి తెప్పిస్తున్న కొత్తమీర అమ్మకాలు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

పాలకూర కిలో రూ.120



ఉమ్మడి జిల్లాలో ఖిలావరంగల్ రైతులు ఆకుకూరలు ఎక్కువగా పండిస్తారు. జిల్లా మొత్తానికి ఇక్కడ పండిన ఆకుకూరలు తరలిస్తుంటారు. అలాంటింది గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకు కూరల పంటలు మొత్తం దెబ్బతినడంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కిలో పాలకూర రూ.100–120 అమ్ముతున్నారు. మార్కెట్‌లో గతంలో 20–30మంది ఆకుకూరలు విక్రయించగా ఇప్పుడు కేవలం నలుగురైదుగురు మాత్రమే ఆకుకూరల విక్రయాలు సాగించడం గమనార్హం. అసలు 80శాతం మంది ఆకుకూరల వైపు కూడా చూడడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా(కిలో)..

	ఆగస్టు	సెప్టెంబర్
టమాట	రూ.30	రూ.25–30
పచ్చి మిర్చి	రూ.45	రూ.20–25
దేశీ చిక్కుడు	రూ.55	రూ.60–70
గోరు చిక్కుడు	రూ.45	రూ.55–70
క్యాబేజీ	రూ.35	రూ.20–40
బెండకాయ	రూ.25	రూ.30–40
కాకరకాయ	రూ.45	రూ.50–60
ఫ్లవర్	రూ.65	రూ.60–65
వంకాయ	రూ.35	రూ.40–60
బిన్నీస్	రూ.90	రూ.120–200
క్యారెట్	రూ.45	రూ.45–60
కీరదోస	రూ.30	రూ.30–40
బీట్రూట్	రూ.35	రూ.35–45
ఆలుగడ్డ	రూ.35	రూ.35–40
చామగడ్డ	రూ.55	రూ.45–60
బీరకాయ	రూ.45	రూ.75–80
దోసకాయ	రూ.45	రూ.35–60
దొండకాయ	రూ.35	రూ.45–60
క్యాప్సికం	రూ.65	రూ.65–80
కొత్తి మీర	రూ.80	రూ.120–150
పాలకూర	రూ.60	రూ.80–120
మసాలాల ధరలు..		
ఎల్లిగడ్డ	రూ.150–200	రూ.400
అల్లం		రూ.180
ఉల్లిగడ్డ		రూ.60
ఇలాచీ		రూ.3,000
లవంగాలు		రూ.900
దాల్చినచెక్క		రూ.320
కందిపప్పు	రూ.120	రూ.200
పెసరపప్పు		రూ.120
చక్కెర		రూ.50

కొనలేని పరిస్థితి ఉంది..



నెల మొత్తం పనిచేస్తే రూ.10 వేలు వస్తున్నాయి. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. రోజుకు రూ.100కు పైగా వాటికే అయితే మిగతా ఖర్చులు ఎల్లేది ఎలా. కూరగాయ ధరలు కిలోకు రూ.వందకు పైగానే ఉన్నాయి. భూపాలపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

– కుర్రి రమేశ్, ప్రైవేట్ ఉద్యోగి, భూపాలపల్లి

రూ.103కోట్లకుపైనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వినాయక నవరాత్రుల ఖర్చు

- ఉమ్మడి జిల్లాలో 8,066 విగ్రహాలు.. జియోట్యాగింగ్ చేసిన పోలీసులు
- లెక్కలోకి రానివి మరో వెయ్యి ఉంటాయని అంచనా
- గతేడాదికంటే గ్రామాలు, తండాల్లో ఐదుశాతం పెరిగిన విగ్రహాలు
- స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో విరివిగా ఇప్పించిన ఆశావహులు

వరంగల్ డెస్క్:

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ అంటే ఆషామాషీ వ్యవహారం కాదు.. విగ్రహం కొనుగోలు నుంచి పూజలు, నిమజ్జనం వరకు భారీ ఖర్చుతోపాటు ఎంతో భక్తి ఉంటేనే నవరాత్రులు ఎలాంటి ఆటంకం లేకుండా ముగిస్తాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈసారి ఏకంగా 8వేలపైచిలుకు విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఇది పోలీసు అధికారుల అధికారిక లెక్క.. ప్రతీ విగ్రహానికి జియోట్యాగింగ్ చేశారు. ఇంకా మారుమూల గ్రామాలు తండాల్లో లెక్కలోని రాని చిన్నా, చితక విగ్రహాలు వెయ్యి వరకు ఉంటాయని అంచనా. ఉత్సవాల నిర్వహణలో విగ్రహం కొనుగోలు మొదలు, రవాణా, స్టేజీ డెకరేషన్, లైటింగ్, పూజలు, అన్నదానం, నిమజ్జనం వరకు అయ్యే ఖర్చు చూస్తే మతిపోవాల్సిందే. భక్తులు ఇచ్చే చందాలపై నిర్వాహకులు ఆధారపడుతుంటారు. మరికొందరు స్వచ్ఛందంగా జేబులోనుంచి ఖర్చు పెడతారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో ప్రతిష్ఠించిన విగ్రహాలను బట్టి సుమారు రూ.103కోట్లకుపైగా ఖర్చు అవుతున్నట్లు స్పష్టమవుతోంది.

గ్రేటర్ పరిధిలో అధిక విగ్రహాలు..

ఉమ్మడిజిల్లా పరిధిలోని గ్రేటర్ వరంగల్ సిటీ హనుమకొండ పరిధిలోనే అత్యధికంగా 2,070 విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు పోలీస్ అధికారులు లెక్క తేల్చారు. తక్కువలో ములుగు జిల్లాలో 645 విగ్రహాలు పెట్టారు. ఇందులో అత్యధికంగా వరంగల్ నగరంలో 40 ఫీట్ల మట్టి విగ్రహం ఉంది. అక్కడక్కడా 12ఫీట్లనుంచి 17 ఫీట్ల వరకు, ఎక్కువగా 5ఫీట్లనుంచి 12ఫీట్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

విగ్రహం, డెకరేషన్, అన్నదానాలకు అధిక ఖర్చు

విగ్రహం చిన్నదైనా.. పెద్దదైనా ప్రతిష్ఠించే వేదిక, లైటింగ్, ఇతరత్రా హంగామాలకు అధికంగా ఖర్చు అవుతోంది. పెద్ద విగ్రహ నిర్వాహకులు దాదాపు 1000 నుంచి 2వేల మంది వరకు, చిన్న విగ్రహాల వారు 500నుంచి వెయ్యి మంది వరకు అన్నదానం చేస్తున్నారు. నిర్వహణ ఖర్చులో వీటికోసం అధికంగా వెచ్చిస్తున్నారు. దీంతోపాటు నవరాత్రుల్లో ఒక రోజు సామూహిక లక్ష్మీపూజ నిర్వహిస్తారు.

- హనుమకొండలోని ప్రాక్టిసింగ్ స్కూల్ సమీపంలో స్థాపించిన 17 అడుగుల విగ్రహం ఖర్చు నిమజ్జనం అయ్యేసరికి రూ.8లక్షలు అవుతున్నట్లు నిర్వాహకులు చెప్పడం గమనార్హం.
- వరంగల్‌లోని 40 అడుగుల మట్టి విగ్రహం తయారీనుంచి ఉత్సవాలు ముగిసేవరకు రూ.30లక్షలు ఖర్చు అవుతుందని ఉత్సవ కమిటీ ప్రకటించింది.
- ఎలాంటి ఆర్భాటం లేకుండా 6ఫీట్ల విగ్రహం ప్రతిష్ఠించినా రూ.50వేల వరకు, 6నుంచి 10ఫీట్ల విగ్రహానికి రూ.75వేల వరకు ఖర్చు వస్తుంది.
- స్నేహనగర్ కాలనీలో 11ఫీట్ల విగ్రహానికి రూ.2.80లక్షల ఖర్చు వస్తుందని కాలనీ అధ్యక్షుడు చిన్నా తెలిపారు.

గ్రామాలు, తండాల్లో పెరిగిన విగ్రహాలు

గత ఏడాదికంటే ఈసారి విగ్రహాలు ఐదుశాతం పెరిగినట్లు పోలీసులు అంచనా వేశారు. పట్టణాల్లో గతేడాదిలాగే విగ్రహాలు ఉన్నా.. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో యువతతోపాటు గ్రామస్తులను ఆకర్శించేందుకు ఆశావహులు విరివిగా విగ్రహాలు ఇప్పించారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ కొత్తగా అధికారంలోకి రావడం.. తమ అధికారాన్ని చూపించుకునేందుకు మరికొన్ని విగ్రహాలు ఇప్పించారు. దీంతో ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు విగ్రహాలు ప్రతిష్ఠించారు. ప్రతీ చిన్న తండాలోనూ రెండేసి విగ్రహాలు కనిపిస్తుండడం గమనార్హం.

30 ఏళ్లనుంచి విగ్రహం పెడుతున్నాం



30 ఏళ్లనుంచి మా కాలనీలో గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నాం. మేము 11ఫీట్ల విగ్రహాన్ని పెట్టాం. నవరాత్రులు మా కాలనీలో పండుగ వాతావరణం ఉంటుంది. తొమ్మిది రోజుల్లో ఒకరోజు లక్ష్మీపూజ ఉంటుంది. కాలనీవాసులు అందరూ పాల్గొంటారు. సుమారు 2వేల మంది వరకు అన్నదానం చేస్తాం. చిన్నపిల్లలకు ఆటలు ఆడిస్తాం. నవరాత్రులు పూర్తయ్యేసరికి రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఖర్చు వస్తుంది.

– నర్సింగరావు (చిన్నా), స్నేహనగర్ కాలనీ అధ్యక్షుడు

జిల్లాల వారీగా విగ్రహాలు (పోలీస్ అధికారుల లెక్కల ప్రకారం)

హనుమకొండ	వరంగల్	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు	మొత్తం
2,070	1,450	1,476	1,665	760	645	8,066

(గల్లీలు, తండాల్లో లెక్కలోకి రాని చిన్నా, చితకవి మరో వెయ్యి వరకు ఉంటాయని అంచనా)

శెభాష్ పోలీస్..

- నగరంలో తల్లీబిడ్డను కాపాడిన జీఆర్పీ పోలీసులు
- సంగెం మండలంలో వ్యక్తిని రక్షించిన కానిస్టేబుల్

నిత్యం ప్రజారక్షణలో నిమగ్నమయ్యే పోలీసులు ఆత్మహత్యకు యత్నించిన తల్లీబిడ్డలతోపాటు, మరోచోట ఓ వ్యక్తిని కాపాడి మరోసారి శెభాష్ అనిపించుకున్నారు. తమ కుటుంబ సభ్యుడు ఆత్మహత్యకు యత్నిస్తున్న విషయాన్ని 100కు డయల్ చేసి చెప్పడంతో వెంటనే స్పందించి వారిని కాపాడిన పోలీసులకు ఆయా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


కాశిబుగ్గ: ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీఆర్పీ సిబ్బంది

వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్


సంగెం: రైల్వే ట్రాక్‌పై ఉండి వీడియో కాల్‌లో మాట్లాడుతున్న రాజు

సంగెం: వరంగల్ ఏనుమాముల ఎంఎస్ నగర్‌కు చెందిన బండి రాజు మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన రాజు.. శుక్రవారం సాయంత్రం సంగెం మండలంలోని చింతలపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బంధువులకు ఫోన్ ద్వారా వీడియోకాల్‌లో చెప్పాడు. దీంతో రాజు బంధువులు డయల్ 100కు కాల్ చేశారు. వెంటనే స్పందించిన ఎస్సై నరేశ్ బీట్ కానిస్టేబుల్ సురేశ్‌కు విషయం చెప్పి ట్రాక్ వద్దకు పంపించాడు. అక్కడకు వెళ్లిన కానిస్టేబుల్ సురేశ్ ట్రాక్‌పై మద్యం మత్తులోపడి ఉన్న రాజును గుర్తించి కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం అందించాడు. రాజు భార్య రజిత, బంధువులు రాగా వారికి రాజును అప్పగించాడు. సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన ఎస్సై నరేశ్, కానిస్టేబుల్ సురేశ్‌కు రాజు కుటుంబసభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీబిడ్డలను కాపాడిన రైల్వే పోలీసులు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్ పాత బీట్ బజారు బ్రిడ్జికి మధ్య రైల్వే పట్టాలపై శుక్రవారం ఓ మహిళ రైలు పట్టాలపై కూతురుతో సహా ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా రైల్వే పోలీసులు కాపాడారు. జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన మానస పానిక్ డిజార్డర్ సమస్యతో బాధపడుతుంది. శుక్రవారం మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో 2 సంవత్సరాల వయస్సు కలిగిన తన పాపను తీసుకుని అండర్ బ్రిడ్జి దగ్గర రైల్వే పట్టాలపైకి చేరింది. అనంతరం పట్టాలపై నడుచుకుంటూ రైలుకు ఎదురుగా వెళ్తుండడంతో డ్యూటీలో ఉన్న పెట్రోలింగ్ సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్టేషన్ ప్లాట్‌ఫాంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ విక్రం, ప్రశాంతి, సుమలత పరుగున వెళ్లి తల్లీబిడ్డను కాపాడారు. స్టేషన్‌కు తరలించి విచారించి మహిళ భర్త, తమ్ముడికి సమాచారం అందించారు. వారిని స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు. మహిళను కాపాడిన జీఆర్పీ సిబ్బందిని సీఐ, ఎస్సైలు అభినందించారు.

కేయూకు నేడు పనిదినం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలకు రెండో శనివారం(ఈనెల 14) పనిదినంగా పరిగణించాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. భారీ వర్షాల కారణంగా ఈనెల 2వ తేదీన సెలవుదినంగా పరిగణించన నేపథ్యంలో నేడు (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది యథావిధిగా విధులకు హాజరుకావాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. నేడు హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలు సైతం పనిదినంగా పరిగణించాలని తెలిపారు.

వదిలెళ్లిపోయావా బిడ్డా...

- రైలు కింద పడి పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య
- వంగాలపల్లి రైల్వేగేటు వద్ద ఘటన
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: బాగా చదువుకుని మమ్మల్ని ఉద్ధరిస్తావనుకుంటే వదిలెళ్లిపోయావా అంటూ శుక్రవారం వంగాలపల్లి రైల్వేగేట్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి రాజు, రమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు కొడారి రాజ్‌కుమార్(15) స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి సెయింట్‌థామస్ హైస్కూల్ హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. అతడి తమ్ముడు కూడా అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా శుక్రవారం ఉదయం హాస్టల్‌లో విద్యార్థి కనిపించలేదు. దాంతో పాఠశాల ప్రిన్సిపాల్.. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో విద్యార్థి రాజ్‌కుమార్ వంగాలపల్లి రైల్వేగేటు సమీపాన విగతజీవిగా పడి ఉన్నట్లు మధ్యాహ్నం సమయంలో తెలిసింది. అయితే సెయింట్‌థామస్ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే రాజ్‌కుమార్ మృతిచెందాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. రూ.లక్షల్లో ఫీజులు తీసుకునే పాఠశాల హాస్టల్‌కు కనీసం వాచ్‌మన్ లేకపోవడం ఏంటని మండిపడ్డారు. కొద్ది రోజుల క్రితం బయటి వ్యక్తులు రాజ్‌కుమార్‌పై పాఠశాలలో దాడి చేశారని, బయటి వ్యక్తులు పాఠశాలలో విద్యార్థిపై దాడి చేస్తే మాకు చెప్పరా.. అని ప్రశ్నించారు. విద్యార్థి నాలుగు రోజులుగా మూడీగా ఉంటున్నట్లు తెలిసిందని, సమాచారం ఇవ్వలేదన్నారు. రాజ్‌కుమార్‌కు ఆత్మహత్య చేసుకోవాల్సిన గత్యంతరం లేదని వాపోయారు. విద్యార్థి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా, విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే పాఠశాల వద్దకు మృతిచెందిన విద్యార్థి రాజ్‌కుమార్ బంధువులు, ఉప్పుగల్లు గ్రామస్థులు అధిక సంఖ్యలో చేరుకుని పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఇదిలా ఉండగా.. విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంతో సెయింట్ థామస్ స్కూల్ వద్ద శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ వేణు.. ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అయితే విద్యార్థి రాజ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని వారి బంధువులు పాఠశాల యాజమాన్యంతో రాత్రి వరకు చర్చలు జరిపారు. కాగా, ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి లోకేశ్ అనే డిగ్రీ విద్యార్థి సైతం వంగాపల్లి రైల్వేగేటు సమీపంలో 13 నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం ఆత్మహత్య చేసుకున్న రాజ్‌కుమార్‌కు లోకేశ్ వరుసకు బాబాయి.


విద్యార్థి చేతిలోనే పాఠశాల ఐడీ కార్డు


రోదిస్తున్న విద్యార్థి తల్లి రమ

ఉదయమే గుర్తించాం..

విద్యార్థి పాఠశాల నుంచి పారిపోయినట్లు శుక్రవారం ఉదయం గుర్తించాం. రోజూ మాదిరిగానే ఉదయం టిఫిన్ సమయానికి ముందు హాజరు తీసుకుంటాం. ఉదయం రాజ్‌కుమార్ లేకపోవడంతో ఇతర విద్యార్థులను విచారించి పాఠశాల నుంచి పారిపోయినట్లు గుర్తించాం. పేరెంట్స్‌కు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. విద్యార్థి మృతిచెందడం చాలా బాధాకరం.

– కేసీ జాన్‌బన్నీ, పాఠశాల ప్రిన్సిపాల్

ఉమ్మడి జిల్లాలో ఉత్తమ స్కూల్..

● సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాలకు గుర్తింపు


అవార్డు అందుకుంటున్న గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని

కాజీపేట రూరల్: కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉత్తమ పాఠశాలగా ప్రథమ స్థానంలో, రాష్ట్ర స్థాయిలో 28వ స్థానంలో నిలిచింది. గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పొలిశెట్టి శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఇటీవల సీ ఫోర్ స్కూల్ ర్యాంకింగ్స్ కమిటీ న్యూఢిల్లీ బృందం గ్యాబ్రియల్ స్కూల్‌ను సందర్శించి స్కూల్ ప్రాముఖ్యత, ఎడ్యుకేషన్, పరిసర ప్రాంతాలను పరిశీలించింది. ఫలితాలు సంతృప్తికరంగా ఉండడంతో సీ ఫోర్ స్కూల్ ర్యాంకింగ్స్–2024 అవార్డుకు ఎంపిక చేసి ప్రకటించారు. ఈ మేరకు న్యూఢిల్లీలో ఈ నెల 11వ తేదీన జరిగిన సీ ఫోర్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో సీ ఫోర్ ర్యాంకింగ్ స్కూల్ డైరెక్టర్ పలేటి, డైరెక్టర్ ఆఫ్ బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ బ్రహ్మల చేతుల మీదుగా గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని ఈఅవార్డును అందుకున్నారు.

ఇక ఆ భూములు ‘అడవి’ కాదు..

- ‘అడవి’ఫారెస్ట్ పదాల తొలగింపునకు లైన్‌క్లియర్
- ధరణి రికార్డుల్లో సవరణకు ప్రభుత్వం జీఓ విడుదల
- తొలగనున్న నారాయణపురం రైతుల కష్టాలు



కేసముద్రం: మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలోని 6 సర్వే నంబర్లలో గల వ్యవసాయ భూమికి పట్టాదారు కాలంలో వస్తున్న అడవి, ఫారెస్ట్ పేర్లను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నారాయణపురం గ్రామ రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లికుదురు మండలంలోని చిన్నముప్పారం రెవెన్యూ పరిధి నారాయణపురం గ్రామాన్ని, కేసముద్రం మండల పరిధిలోకి చేర్చారు. అనంతరం జరిగిన భూప్రక్షాళనలో అధికారుల తప్పిదం కారణంగా నారాయణపురం గ్రామంలోని భూములన్నీ రెవెన్యూ రికార్డుల్లో అడవిగా నమోదయ్యాయి. అప్పటి నుంచి ఆ గ్రామానికి చెందిన సుమారు 1,400 మంది రైతులకు రుణాలు, రైతుబంధు, రైతుబీమా పొందలేకపోయారు. ఆ తర్వాత పలుమార్లు రైతులు ఆందోళనలు, ధర్నాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో 354 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించగా, వారు గత ఏడాది రైతుబంధు, బ్యాంకు రుణాలు పొందగలిగారు. ఇక మిగిలిన రైతులకు చెందిన వ్యవసాయ భూములన్నీ, పట్టాదారుకాలంలో అడవి, ఫారెస్టు అని పేర్లు నమోదు కావడంతో, వారికి పట్టా పాసుబుక్కులు రాలేదు. దీంతో ఇన్నేళ్లుగా ప్రభుత్వ పథకాలకు ఆ రైతులు దూరమయ్యారు. ఈ క్రమంలో నారాయణపురం గ్రామంలోని 149, 150, 154, 165, 166, 168 సర్వేనంబర్లలోని 1,398.03 ఎకరాల భూమికి పట్టాదారు కాలంలో వచ్చే అడవి, ఫారెస్ట్ అనే పదాలను తొలగించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా సర్వేనంబర్‌లలో ఉన్న రైతులందరికీ పట్టాపాసు బుక్కులు అందనుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.